
మల్లాపూర్: మండపంలో దుర్గమాతకు ప్రత్యేక పూజలు


సారంగాపూర్: దుబ్బరాజన్న ఆలయంలో సరస్వతి అమ్మవారి అలంకారంలో దుర్గామాత


జగిత్యాలరూరల్: చల్‌గల్‌లో దుర్గమాతను దర్శించుకుంటున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రావణి


కథలాపూర్: దుర్గామాత మండపంలో పూజలు చేస్తున్న భక్తులు

మండపాల్లో పూజలు.. అన్నదానాలు

జగిత్యాలటౌన్/జగిత్యాలరూరల్/మెట్‌పల్లి/కోరుట్ల/రాయికల్/కథలాపూర్/ఇబ్రహీంపట్నం/మల్లాపూర్/సారంగాపూర్: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన మండపాల్లో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కథలాపూర్, చింతకుంట, భూషణరావుపేట, దుంపేట, దూలూర్‌లో సాయంత్రం భజనలు చేశారు. ఇబ్రహీంపట్నం మండలం కేశాపూర్‌లో చండీయాగం చేశారు. అర్చకులు రొట్టె కిషన్‌శర్మ, సంజయ్‌శర్మ, చరణ్ పాల్గొన్నారు. మల్లాపూర్‌మండల కేంద్రంతో పాటు అన్నిగ్రామాల్లో అమ్మవారు శ్రీసరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. మెట్‌పల్లి పట్టణంలో దుర్గామాతకు ఆర్యవైశ్యులు ఫలాభిషేకం చేశారు. మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలు సమర్పించారు. కోరుట్లలోని త్రిశక్తి అమ్మవారి ఆలయంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం, తులాభారం నిర్వహించారు. జిల్లాకేంద్రంలో జయదుర్గా సేవాసమితి నెలకొల్పిన అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. రాయికల్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేపట్టారు. మహిళలు కుంకుమపూజల్లో పాల్గొన్నారు. జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్‌లో దుర్గమాతకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి పూజలు చేశారు. సారంగాపూర్‌లోని దుబ్బరాజన్న ఆలయంలో అమ్మవారి సరస్వతి అలంకరణలో దర్శనమిచ్చారు. బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను గరుడవాహనంపై ఊరేగించారు.


ఇబ్రహీంపట్నం: కేశాపూర్‌లో దుర్గాదేవి మండపం వద్ద చండీయాగంలో అర్చకులు


రాయికల్: ఒడ్డెలింగాపూర్‌లో అక్షరాభ్యాసం చేయిస్తున్న సీఎం శర్మ


జగిత్యాలటౌన్: సరస్వతీ పూజలో విద్యార్థులు


మెట్‌పల్లి: బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు


సారంగాపూర్: బీర్‌పూర్ ఆలయంలో గరుడ వాహాన సేవ అందుకుంటున్న స్వామివారు

క్లుప్తంగా

దుర్గామాతకు రథోత్సవం


పెగడపల్లి రాజన్న ఆలయంలో సరస్వతి దేవికి రథోత్సవం

పెగడపల్లి: శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా అమ్మవారు సరస్వతి రూపంలో దర్శనమిచ్చారు. మహిళలు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మండల కేంద్రంలోని రాజన్న ఆలయంలో సర్వసతిమాతకు రథోత్సవం గావించారు.

కలెక్టర్‌ను కలిసిన గ్రూప్-1 ఉద్యోగి హారిణి


కలెక్టర్‌తో హారిణి

జగిత్యాల:గ్రూప్-1 ఫలితాల్లో జిల్లాకు ప్రొబేషనరీ డెప్యూటీ కలెక్టర్‌గా ఎంపికై న కన్నం హారిణి కలెక్టర్ సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం అనంతపల్లికి చెందిన హారిణి గ్రూప్-1 ఫలితాల్లో 55వ ర్యాంక్ సాధించారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌గా జిల్లాలో విధుల్లో చేరారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై అనిల్

ఇబ్రహీంపట్నం: దసరా ఉత్సవాల సందర్భంగా మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా సోమవారం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్స్, సస్పెక్ట్ షీటర్స్‌కు ఎస్సై అనిల్ కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కడైనా గొడవలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో దసరా జరుపుకోవాలన్నారు.

బతుకమ్మ వేడుకలు


బతుకమ్మ వేడుకల్లో సంస్కార భారతి ప్రతినిధులు

జగిత్యాలటౌన్: సంస్కారభారతి జిల్లా సాహితీ రంగ కన్వీనర్ రచయిత్రి అయిత అనిత ఆధ్వర్యంలో జగిత్యాల ఎల్‌జీ గార్డెన్‌లో సోమవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటమే లక్ష్యంగా సంస్కారభారతి కార్యక్రమాలు నిర్వహిస్తుందని అయిత అనిత తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భీమయ్య, ఉపాధ్యక్షురాలు సుచరిత, సంయుక్త కార్యదర్శి కొక్కుల శైలజ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి మొలకెత్తిన ధాన్యం


ఎర్దండిలో మొలకెత్తిన మొక్కజొన్న చూపిస్తున్న రైతు

ఇబ్రహీంపట్నం: ఇటీవల భారీ వర్షాలకు మొక్కజొన్న పంట మొలకెత్తడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రైతులు ఆరుగాలం పండించిన పంట మొలకెత్తడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకొని పరిహారం చెల్లించాలని మండల రైతులు కోరుతున్నారు.

పార్కింగ్ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న నాయకులు

కోరుట్ల: పట్టణ శివారులోని రైల్వే స్టేషన్ వద్ద వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా అధ్యక్షుడు చెన్నా విశ్వనాథం డిమాండ్ చేశారు. రైల్వే స్టేషన్‌ను సోమవారం నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, ఎండీ ముఖ్రం తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు

- ధర్మపురిలో నేడు వేడుకలు

ధర్మపురి: బతుకమ్మ వేడుకలను మంగళవారం ధర్మపురిలో నిర్వహించనున్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది గోదావరి తీరం, నంది కూడలి వద్ద ఏర్పాట్లు చేశారు. గోదావరిలో భక్తుల సౌక్తుల సౌకర్యార్థం హైమాస్ లైట్లను బిగించారు. మహిళల కోసం మట్టి పోసి రోడ్డు సౌకర్యం కల్పించారు. మంగలిగడ్డ పుష్కరఘాట్, సంతోషిమాత పుష్కరఘాట్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నంది కూడలి వద్ద ఆహ్వాన వేదిక వేశారు. గోదావరి ఉధృతంగా ఉన్నందున నదిలో బల్లకట్టును అందుబాటులో ఉంచారు. తీర ప్రాంతమంతా చెత్తాచెదారం లేకుండా జేసీబీతో చదును చేయించారు. గోదావరిలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. సద్దుల వేడుకకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఎప్పటిలాగే 1981 ఎస్సెస్సీ మిత్రబృందం కన్వీనర్ జక్కు రవీందర్ ఆధ్వర్యంలో బతుకమ్మలకు బహుమతులు అందించనున్నారు.


వేడుకలకు చేస్తున్న ఏర్పాట్లు మున్సిపల్ సిబ్బంది

బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు చేయాలి

ఇబ్రహీంపట్నం: బతుకమ్మ పండుగ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో బతుకమ్మలను నిమజ్జనం చేసే ప్రదేశాల్లో ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో మహమ్మద్ సలీం పంచాయతీ సెక్రటరీలను ఆదేశించారు. సోమవారం మండలంలోని వర్షకొండ, ఇబ్రహీంపట్నంలలో బతుకమ్మ నిమజ్జనం చేసే ప్రదేశాలను పరిశీలించారు. లైటింగ్స్, పారిశుద్య పనులు చేపట్టాలని కోరారు.


వర్షకొండ చెరువు వద్ద పరిశీలిస్తున్న ఎంపీడీవో ఎండీ.సలీమ్

ఉద్యోగ విరమణ పొందిన వారికి అండగా ఉంటాం

జగిత్యాలక్రైం: ఉద్యోగ విరమణ పొందిన వారికి పోలీస్‌శాఖ తరపున అండగా ఉంటామని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. విరమణ పొందిన ఏఎస్సై మహ్మద్ అబ్దుల్లాఖాన్‌ను సోమవారం సన్మానించారు. ఉద్యోగ నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందడం అభినందనీయమన్నారు. అబ్దుల్లాఖాన్‌ను పోలీసు వాహనంలో ఎక్కించి పోలీసు బ్యాండ్ మేళాతో ఘనంగా వీడ్కోలు పలికారు. ఎస్పీ డీఎస్పీ వెంకటరమణ, ఎస్బీ సీఐ ఆరిఫ్ అలీఖాన్, ఆర్ఐ కిరణ్‌కుమార్, ఎస్సైలు సతీశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.


ఏఎస్సైని సన్మానిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కండ్లపల్లి చెరువు మరమ్మతులు చేపట్టాలి

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి చెరువు కట్ట కింద బుంగ పడినట్లు రైతులు అనుమానిస్తున్నారని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని మాజీమంత్రి జీవన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం అధికారులు, రైతులతో కలిసి కండ్లపల్లి చెరువు కట్టను, మత్తడిని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ, నీటి ప్రవాహం ఎక్కువగా ఉండగా చెరువు నాలుగు తూములను తెరవాలని సూచించారు. ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.


అధికారులతో కలిసి చెరువు కట్టను పరిశీలిస్తున్న మాజీమంత్రి జీవన్‌రెడ్డి

నాయకుల విగ్రహాలకు ముసుగులు ధరించాలి

ఇబ్రహీంపట్నం: జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచుల ఎన్నికల కోసం ఎన్నికల కమిషన్ కోడ్ ప్రకటించడంతో సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద శిలఫలకాలకు అటెండర్ రాకేష్ పేపర్లను అతికించారు. ఎంపీడీవో సలీం పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్నికల కోడ్‌ను పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా పాటించాలన్నారు. ప్రారంభోత్సవ, శిలఫలకాలకు పేపర్లను అతికించడంతో పాటు నాయకుల విగ్రహాలకు ముసుగులను వేయాలని కార్యదర్శులను ఎంపీడీవో ఆదేశించారు.


మండల పరిషత్ కార్యాలయాల వద్ద శిలఫలకాలకు పేపర్లను అతికిస్తున్న అటెండర్లు

బీఆర్‌ఎస్‌లో చేరిక

కోరుట్ల రూరల్: నాగులపేట గ్రామానికి చెందిన పలువురు నాయకులు సోమవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. జగిత్యాల పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జెడ్పీ మాజీ చైర్మన్ దావ వసంత కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ సర్పంచ్ కేతిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ ఖయ్యూం, నాయకులు సింగిరెడ్డి నర్సారెడ్డి, బోదుకం సుదాకర్, చిట్టిరెడ్డి నారాయణరెడ్డి, కాటిపెల్లి గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న విద్యాసాగర్‌రావు

వృత్తి విద్య కోర్సులతో ఉపాధి

కథలాపూర్: వృత్తి విద్య కోర్సులు పూర్తి చేస్తే విద్యార్థులకు త్వరగా ఉపాధి అవకాశాలు వస్తాయని వైద్యాధికారి సునీతరాణి అన్నారు. సోమవారం కథలాపూర్ మోడల్ స్కూల్‌లో వృత్తి విద్య కోర్సుల్లో చేరిన విద్యార్థులకు ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా ఆసుపత్రిలో శిక్షణ తరగతులు నిర్వహించారు.

సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న అధికారులు

మల్యాల: రామన్నపేట గ్రామంలో సోమవారం సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. గ్రామంలో లోవోల్టేజీ సమస్య తలెత్తడంతో గ్రామస్తుల విన్నపం మేరకు సోమవారం 25కేవీ సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఏఈ ఆకునూరి శ్రీనివాస్, విద్యుత్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతకు సహకరించాలి


ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మెట్‌పల్లి: పట్టణ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మోహన్ కోరారు. మున్సిపల్ ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. పారిశుధ్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఆర్ఐ అక్షయ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్ తదితరులున్నారు.

వడ్డె ఓబన్న సేన అధ్యక్షుడిగా రాజు


రాజు, పాపారావు

మల్లాపూర్: మల్లాపూర్ వడ్డె ఓబన్న సేన అధ్యక్షుడిగా ఆలకుంట రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం వడ్డెర సంఘం సభ్యులు సమావేశంలో కమిటీని ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా బోదాసు పాపారావు, గౌరవ అధ్యక్షుడిగా బోదాసు సాయిలు, కోశాధికారిగా అల్లెపు నరేశ్, సభ్యులుగా సూర నర్సయ్య, అల్లెపు మహేశ్, సూర పాపయ్య, వెంకటేశ్, గండికోట శ్రీను, బోదాసు శేఖర్, ఆలకుంట రాజ్‌కుమార్, బోదాసు మహేశ్, దుర్గయ్య, రాజరెడ్డి, చంద్రయ్య, వెంకటేశ్, రాజశేఖర్ ఎన్నికయ్యారు.

నిధులు మంజూరు చేయాలి

కోరుట్లటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో గణిత ప్రయోగశాలకు రూ.10వేలు మంజూరు చేయాలని తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర సలహాదారు చౌడారపు రాంప్రసాద్ సోమవారం ప్రభుత్వానికి విన్నవించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్ పథకం రద్దు కావడంతో ప్రయోగశాల పరికరాలకు నిధుల విడుదల జరగలేదన్నారు. స్కూల్ గ్రాంటు పాఠశాల అవసరాలకే సరిపోవడంలేదన్నారు. ప్రభుత్వం రూ.10 వేలు గణిత ప్రయోగశాలకు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌లో చేరికలు


ధర్మపురిలో మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు కార్యకర్తలు

ధర్మపురి: మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి మంత్రి కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీకి పునాది కార్యకర్తలేనని, వారి సంక్షేమానికి దేనికైనా సిద్ధమేనని అన్నారు.


మల్లాపూర్: ముత్యంపేట శివారులోని రైతువేదిక సమీపంలో మెట్‌పల్లి–ఖానాపూర్ రోడ్డు గుంతలమయంగా తయారైంది. మెట్‌పల్లి నుంచి మల్లాపూర్ మండల కేంద్రానికి, నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు ఆర్టీసీ బస్సులు, అంతరజిల్లా వాహనాలతో నిత్యం రోడ్డు రద్దీగా ఉంటుంది. రోడ్డు మధ్యలోని కల్వర్టు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణికులు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
మహ్మద్ ఫైజాన్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ సంప్రదించ వలసిన నెంబర్: 9550384101

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ముగిసిన బ్లాక్ లెవల్ స్పోర్ట్స్‌మీట్


విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

పెగడపల్లి: మండలకేంద్రంలో మైభారత్ (మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ సోమవారం రాత్రి ముగిసింది. ముగింపు కార్యక్రమంలో జిల్లా చైల్డ్ మ్యారేజ్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ భూమేశ్ పాల్గొన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, రెండింటినీ సమానంగా స్వీకరించాలన్నారు. యువత చదువుతో పాటు క్రీడలు, రాజకీయాల్లో రాణించాలని సూచించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మేరా భారత్ జిల్లా వాలంటరీ మారం గణేశ్, ఆర్గనైజర్స్ కార్తీక్, చందు, రాహుల్ పాల్గొన్నారు.

రిజర్వేషన్ల ఎంపికలో ఎస్సీలకు అన్యాయం


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోరుట్ల రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల ఎంపికలో ఎస్సీలకు అన్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనతడుపుల అంజయ్య అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు 2011 జనాభా లెక్కల ప్రకారం ఇస్తామని చెప్పడం ఎస్సీ, ఎస్టీలను మోసం చేయటమేనన్నారు. అదే క్రమంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించి తాజా జనాబా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించటం ఎస్సీలకు అన్యాయం చేసినట్టేనని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కూడా ఇప్పటి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాల్సి ఉందన్నారు. మాజీ సర్పంచులు చెప్యాల నర్సయ్య, దుంపాల నర్సా రాజనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలు చేయాలి

కథలాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో పక్కాగా ఎన్నికల కోడ్ అమలు చేయాలని ఎంపీడీవో శంకర్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.